క్లుప్తంగా

పేదలకు వైఎస్సార్ బీమా వరం



బీమా అందజేస్తున్న పేరయ్య

బల్లికురవ: కుటుంబంలో పెద్దదిక్కు చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టి వైఎస్సార్ బీమా ఓ వరమని బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు, మండల కన్వీనర్ చింతల పేరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో గుండెపోటుతో చనిపోయిన కే తిరుపతయ్య భార్య రోజాకు తక్షణ సాయంగా మట్టి ఖర్చుల కింద పదివేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ టీ రాహేలు, మండల రైతు ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు డీ. రామంజనేయులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ టీ. వజ్రయ్య పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు అందించాలి



సమావేశంలో సూచనలందిస్తున్న రమణారెడ్డి

చీరాల టౌన్: కౌలుకు భూమిని తీసుకుని వ్యవసాయం చేసే కౌలు రైతు గుర్తింపు కార్డులు ఉన్న కౌలు రైతులకు బ్యాంకులు పంట రుణాలు అందించాలని మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ కె.రమణారెడ్డి సూచించారు. శుక్రవారం మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మండలస్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో ఉన్న బ్యాంకులు కౌలు రైతు గుర్తింపు కార్డులు ఉన్న వారికి పంట రుణాలు అందించి ఆదుకోవాలన్నారు. సమావేశంలో మండల ఏవో సుమతీ, నీటిపారుదల ఏఈ పవన్‌కుమార్, మండల సభ్యులు, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు ఉన్నారు.

రేపు విశ్వకర్మ జయంతి వేడుకలు



అద్దంకిలో ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అద్దంకి రూరల్: విశ్వకర్మ జయంతి వేడుకలు ఆదివారం స్థానిక కమఠేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్నట్లు శుక్రవారం విశ్వకర్మ ఉత్సవ కమిటి సభ్యులు తెలిపారు. దీనిలో భాగంగా ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఉదయం 7 గంటల నుంచి పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి, విశ్వకర్మ కృపకు పాత్రులు కావాలని సభ్యులు కోరారు.

చీరాల అర్బన్: విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మ జయంతిని ప్రతి ఏడాది సెప్టెంబర్ 17న నిర్వహిస్తుంటామని, విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించి జీవో నెం. 24ను విడుదల చేయడంపై రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొర్రెపాటి ప్రభాకర్ విశ్వకర్మ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఆధునిక సమాజ నిర్మాతలు ఇంజినీర్లు



చీరాలలో విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న ఇంజినీర్లు



బల్లికురవలో ఇంజినీర్లను సత్కరిస్తున్న ఎంపీడీవో



మార్టూరులో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రోటరీ సభ్యులు, ఉపాధ్యాయులు

చీరాల అర్బన్/వేటపాలెం: ఆధునిక సమాజ నిర్మాతలు ఇంజినీర్లు అని డ్రైనేజీ చీరాల డివిజన్ ఈఈ బీ మురళీకృష్ణ అన్నారు. ఇంజినీర్స్ డే సందర్భంగా శుక్రవారం డ్రైనేజి చీరాల డివిజన్ కార్యాలయం ఆవరణలోని భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజం అభివృద్ధి దిశగా దూసుకుపోతుందంటే అది ఇంజినీర్ల ఘనతేనన్నారు. ఎన్నో ఆవిష్కరణలతో మానవ జీవితాన్ని సుఖవంతంగా చేయడంతో పాటు అనేక సమస్యలను ఇంజినీర్‌లు పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్-1 డీఈఈ డీవీ సుబ్బారావు, ఏఈఈలు బీ.ఆదిలక్ష్మి, జేవై కోటేశ్వరరావు, సీహెచ్ రాంబాబు, ఆర్ డానియేల్, సబ్ డివిజన్-2 డీఈఈ ఆర్.మల్లికార్జునరావు, ఏఈఈలు డి.అంజిబాబు, ఎస్.రత్నశేఖర్, జెడ్ పురుషోత్తం, టీవీఎస్ఎల్ భార్గవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. వేటపాలెం సెయింటాన్స్‌లో ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో విశ్వేశ్వరయ్యకు నివాళులర్పించారు.

బల్లికురవ: భారతీయుల ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పిన భారతరత్న విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయమని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కొనియాడారు. శుక్రవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో విశ్వేశ్వరయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయితీ రాజ్ ఏఈ జీ, హనుమంతనాయక్, ఎస్ఎస్ఏఈ రాజన్‌బాబు, గృహనిర్మాణ సంస్థ ఏఈ దుర్గా రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలను దుశ్శాలువాలతో సత్కరించారు. ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఎంఈవో-2 కే రమేష్‌బాబు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: వాసవీ క్లబ్, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించి ఇంజినీర్లను సన్మానించారు. అనంతరం నిరుపేద కుటుంబానికి చెందిన కోనే బుజ్జమ్మ కుమార్తె మహేశ్వరీ వివాహానికి కావాల్సిన ఆర్థిక సహాయంతో పాటు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్‌గవర్నర్ ఊటుకూరి ఉమాఅన్నపూర్ణ, కేబినెట్ సెక్రటరీ గ్రంధి లక్ష్మీ నాగరాజకుమారి, కేబినెట్ ట్రెజరర్ వెంకట సుజాత, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ ఏ పెద ఆంజనేయులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

సంతమాగులూరు (అద్దంకి): రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఆయన మండలంలోని ఫత్తేపురం పంచాయతీ బండివారిపాలెంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం నుంచి ఆ గృహంలోని అర్హులైన వారికి అందిన సంక్షేమ పథకాలు, దాని ద్వారా వారికి కలిగిన లబ్ధిని తెలిపే కార్డులను అందజేశారు. వృద్ధులను, యువకులను పలుకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ కావాలని పనిగట్టుకుని విమర్శించే వారు తప్ప మిగిలిన వారంతా ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈసారి ప్రతిపక్ష పార్టీలు ఏకమై వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని చూస్తున్నాయన్నారు. జగన్ ఓడించడం వారి తరం కాదన్నారు. వారికి ప్రజలు ఓట్లతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతా రామారావు, జెడ్పీటీసీ అడవి శ్రీనిసరావు, మండల నాయకుడు అట్లా పెద్ద వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక పందిళ్లకు అనుమతి తప్పనిసరి



మేదరమెట్లలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు



సర్వాంగ సుందరంగా దర్శనమిస్తున్న వినాయక విగ్రహాలు

అద్దంకి (సంతమాగులూరు): వినాయక చవితికి పందిళ్లను ఏర్పాటు చేసి ఉత్సవాలు చేయాలనుకునే వారు తప్పనిసరిగా సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలని సంతమాగులూరు సీఐ ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. అనుసరించాల్సిన నిబంధనల గురించి తెలియజేశారు. వినాయక పందిరి నిర్వహించాలనుకునే వారు సంబంధిత స్టేషన్ ఎస్‌హెచ్‌వో అనుమతి తీసుకోవాలని చెప్పారు. అంతకంటే ముందుగా ఐదు మంది లేదా ఎక్కువ మంది కలిసి కమిటీగా ఏర్పాటు కావాలన్నారు. వారి వివరాలు గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీలు పోలీసులకు అందజేయాల్సి ఉంటుందన్నారు. ప్రైవేటు లేదా పంచాయతీ, మున్సిపాలిటీ స్థలాల్లో పందిళ్లు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయాలనుకునే వారు ఆయా అధికారుల అనుమతితోపాటు పరిసర ప్రాంతాల్లో నివశించే వారి అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ అనుమతితోపాటు, నిబంధనలను పాటించాలన్నారు. విగ్రహాల ఎత్తు, బరువు నిమజ్జన మార్గం, ప్రదేశం, ఉపయోగించే వాహనాల వివరాలు విధిగా ఎస్‌హెచ్‌ఓకు తెలియజేయాలని చెప్పారు. గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే లౌడ్ స్పీకర్లను ఉపయోగించాల్సి ఉంటుందన్నారు. అసభ్య నాట్య ప్రదర్శనలు, ఇంకా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూసుకుంటూ ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా నిమజ్జనం చేయాలని చెప్పారు. ఈ నిబంధనలను మండలంలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌హెచ్‌వో ప్రభాకర్ తెలిపారు.

వినాయకులు సిద్ధం..

మేదరమెట్ల: వినాయక చవితి పండుగ దగ్గరలోకి రానుండటంతో మండలంలోని ప్రజలు వినాయక విగ్రహాల గురించి చర్చించుకోవడం మొదలైయ్యింది. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల తమ్మవరం రోడ్డులో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రం పాలీ జిల్లా సాదిడీ గ్రామానికి చెందిన జతారామ్ తన కుంటుంబ సభ్యులతో కలసి గత ఐదు మాసాలుగా వినాయక విగ్రహాలను తయారుచేస్తున్నారు. ప్రస్తుతం విగ్రహాలకు రంగులు వేసే పనిలో నిమగ్నమై ఉన్నారు.

కారంచేడు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో వినాయక విగ్రహాలు, మండపాలు ఏర్పాటు చెయ్యాలనుకునే వారు తప్పకుండా ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉందని కారంచేడు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతు గ్రామాల్లో, వీధుల్లో వినాయక ప్రతిమలను కాలుష్య రహిత విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన వలపర్ల విద్యార్థులు



విజేత క్రీడాకారులతో ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ, ఉషా

మార్టూరు: ఇంకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో మార్టూరు మండలానికి చెందిన పలువురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వలపర్ల జెడ్పీ పాఠశాల నుంచి 10 మంది బాలికలు, ఐదుగురు బాలురు, కోనంకి పాఠశాల నుంచి 3, కోలలపూడి, మార్టూరు పాఠశాలల నుంచి ఇద్దరిద్దరు చొప్పున, దరిశి పాఠశాల నుంచి ఒకరు త్వరలో ఒంగోలులో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై నట్లు వలపర్ల పీఈటీ రవి దేవరాజు తెలిపారు.

వాలీబాల్ పోటీలకు వేటపాలెం విద్యార్థులు

వేటపాలెం: వేటపాలెం జెడ్పీహెచ్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు స్కూల్ గేమ్స్ పోటీల్లో 16 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. స్కూల్ గేమ్స్‌కి నియోజకవర్గ స్థాయిలో చీరాల ల్లో వాలీబాల్ పోటీలు నిర్వ హించారు. ఈ పోటీల్లో జెడ్పీహెచ్ఎస్ బాలిక నాలుగు విభాగల్లో 16 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 16వ తేదీన బూదవాడలో జరిగే జల్లాస్థాయి సెలక్షన్స్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. విజేత క్రీడాకారులను హెచ్ఎం దుర్గాప్రసాద్, పీడీ కోటేశ్వరమ్మ, శ్రావణి అభినందించారు.

– పందిళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగంణలో అథ్లెటిక్ పోటీల్లో బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్లు ప్రిన్సిపాల్ బి విజయలక్ష్మి తెలిపారు.

క్షణికావేశంతో అనేక అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సందీప్

చీరాల అర్బన్/చీరాల టౌన్: క్షణికావేశం ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందని సైక్రియాటిస్ట్ డాక్టర్ సందీప్ అన్నారు. ఆత్మహత్యా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఒత్తిడిని తగ్గించుకోవడం లక్ష్యాన్ని చేరుకోవడం అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రేమ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ ఐ.బాబూరావు మాట్లాడుతూ ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందన్నారు. క్షణికావేశంతో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. ఐకాన్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ కొండలరావు, రోటరీ క్లబ్ గవర్నర్ సురేష్ , జీవై ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ఎస్.పద్మజ, జీఎస్ వరలక్ష్మి, ఝాన్సీరాణి, రోజ్‌హెల్మా, పి.సరళకుమారి, కె.శ్రీవల్లి, పి.యామిని, కేవీ సుజాత, మామిడాల శ్రీనివాసరావు, పీ రామకృష్ణ, డీవీ సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

భూ వివాదంలో కేసు నమోదు

మార్టూరు: దాయాదుల మధ్య జరిగిన భూ వివాదంలో ఓ మహిళ గాయపడిన ఘటనలో శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై కమలాకర్ వివరాల మేరకు.. కొలలపూడికి చెందిన వల్లెపు ఏడుకొండలమ్మకు తన మరిది వల్లేపు నాగేశ్వరరావు కుటుంబంతో ఆస్తి వివాదాలు ఉన్నాయి. ఈక్రమంలో గత బుధవారం రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదం పెరిగి ఘర్షణకు దారతీసింది. నాగేశ్వరరావు ఆతని భార్య సుబ్బరావమ్మ, కుమారులు మణికంఠ, సాయి చంద్లు ఏడుకొండలమ్మను అసభ్య పదజాలంతో దూషిస్తూ కర్రతో దాడి చేశారు. దాడిలో గాయపడిన ఏడుకొండలమ్మను స్థానికులు మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుతోపై నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జగనన్న సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం



మార్టూరు శిక్షణ శిబిరంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్

మార్టూరు: గ్రామీణ ప్రాంతాల్లోని మారుమూలలకు సైతం సంపూర్ణ వైద్య సేవలు అందించటం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని జెడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ పిలుపునిచ్చారు. స్థానిక సచివాలయం-1లో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది, గ్రామ వలంటీర్లతో నిర్వహించిన శిక్షణ, అవగాహన శిబిరంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే కృష్ణకుమారి, సర్పంచ్ భూక్యా సునీతాబాయి, ఎంపీపీ భుక్యా శాంతిబాయి, ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ పీ సురేబాబు, జీ రవిచంద్, డాక్టర్ నిహారిక, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు, వలంటీర్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జే.పంగులూరులో..



ఇంటింటి సర్వే చేస్తున్న సిబ్బంది

జే.పంగులూరు: రాష్ట్ర ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి పరిష్కరించడమే జగనన్న సురక్ష అని జిల్లా హౌసింగ్ పీడి, మండల ప్రత్యేకాధికారి ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని రామకూరు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపెయిన్ నిర్వహించి 7 రకాల రక్త పరీక్షలు చేశారు. ఎంపీడీఓ రామాంజినేయులు, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకటసుబ్బారావు, నాయకులు అడ్డగడ ఆంజనేయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



భోజనాన్ని రుచిచూస్తున్న బ్రహ్మనందరెడ్డి

చినగంజాం: చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మనందరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని భాగ్యనగర్, రామచంద్రనగర్ గ్రామాల్లోని అంగన్ వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. అంగన్ వాడీ కేంద్రాల నిర్వాహణ తీరు, పరిసరాల పరిశుభ్రత, చిన్నారుల హాజరు, పౌష్టికాహార పంపిణీ తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం బాబురావు, రమేష్, అంగన్‌వాడీ సిబ్బంది శాంతి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న అధికారులు

అద్దంకి రూరల్: సమగ్ర సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ఉప వ్యవసాయ సంచాలకురాలు విజయనిర్మల అన్నారు. శుక్రవారం ఆత్మవారి సౌజన్యంతో మండలంలోని కలవకూరు రైతు భరోసా వద్ద రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ మొక్కజొన్న, శనగపంటలో తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలను వివరించారు. ఏరువాక కేంద్ర శాస్త్ర వేత్త ఓబయ్య మాట్లాడుతూ విత్తన శుద్ధి తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ మస్తాన్‌రావు, ఏఈవో కోటేశ్వరరావు పాల్గొన్నారు.